www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 ఆగస్టు 2023
5



రైతులకు మెరుగైన సేవలందించాలి

చింతకొమ్మదిన్నె : రైతులకు మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక కెవికెను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కెవికె అందిస్తున్న సేవలను, సాంకేతిక కార్యక్రమాల పురోగతి గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ రెండో తేదీన పులివెందులలో వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. ఇది కడప జిల్లా వాసులకు మంచి సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. బీఎస్సీ హానర్స్, బీఎస్సీ కమ్యూనిటీ కోర్సులకు సంబంధించిన విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్ కోసం సెప్టెంబర్ 2 సాయంత్రం నాలుగు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి శ్రీనివాస ఆచారి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బద్వేల్ వైసిపిలో అసమ్మతి సెగలు

- రేపు సజ్జలతో ఎమ్మెల్సీ అసమ్మతి నేతల భేటీ
- నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు సన్నద్ధం
- కింది స్థాయి కేడర్‌లో అయోమయం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

బద్వేల్ వైసిపిలో అసమ్మతి సెగలు కక్కుతోంది. రెండేళ్ల కిందటి స్థానిక సంస్థల ఎన్నికల దగ్గర నుంచి ఎమ్మెల్యే డిసిగోవిందరెడ్డి ఒంటెత్తు పోకడలను సహించలేని ప్రత్యర్థి నాయకత్వం మండిపడుతోంది. ఒంటెత్తు పోకడలు శృతిమించిన నేపథ్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. బద్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో నాలుగు ప్రధాన మండలాలైన కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాలకు చెందిన సర్పంచ్‌ల దగ్గర నుంచి ప్రస్తుత, మాజీ ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, ఇతర నాయకులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే నియోజకవర్గ వ్యాప్తంగా ఇద్దరు నాయకులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, మిగిలిన నాయకత్వాలను బలహీనం చేస్తున్న అంశంపై ప్రధానంగా ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారంపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన కుటుంబ సభ్యులే అసమ్మతి బృందానికి నాయకత్వం వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులే అసమ్మతి నాయకత్వం వహిస్తుండడంతో అధికార వైసిపి కిందిస్థాయి కేడర్‌లో గందరగోళం నెలకొంది. ఎవరి వెంట నడవాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో కూరుకుపోయినట్లు తెలుస్తోంది. మరో ఆర్నెళ్ల వ్యవధిలో 2024 సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే నాయకత్వాన్ని ఆయన కుటుంబసభ్యులే సవాల్ చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఎమ్మెల్యే కుటుంబంలో చీలికలు వస్తున్న నేపథ్యంలో వైసిపి నాయకత్వానికి ధీటైన నాయకత్వం ప్రత్యర్థి టిడిపిలో ఉండడం ఆందోళన నెలకొంది.

నేటి నుంచి పిహెచ్‌సిల రేషనలైజేషన్

- 620 మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్
- సీనియారిటీ, ఖాళీల గుర్తింపులో జాప్యం
- ఎంపిహెచ్‌ఎస్ మేల్ ఉద్యోగులే అత్యధికం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జోన్-4 పరిధిలోని పిహెచ్‌సిల బలోపేతానికి కసరత్తు ఊపందుకుంది. జిల్లాలోని ఆర్‌డి కార్యాలయ అధికారులు ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలోని ఉద్యోగుల సీనియారిటీ, ఖాళీల గుర్తింపు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. కౌన్సెలింగ్ ముందున్నా ఉద్యోగుల సీనియారిటీ, ఖాళీలను గుర్తించి జాబితాను వెల్లడించడంలో జాప్యం నెలకొందని వాదనలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించిన నేపథ్యంలో జోన్-4 పరిధిలో సుమారు 630 పిహెచ్‌సి పనితీరును మెరుగు పరచడంపై దృష్టి సారించింది. ప్రతి పిహెచ్‌సిలో 14 మంది వివిధ రకాల కేడర్ల అధికారులు ఉండాలనే ఉద్దేశంతో రేషనలైజేషన్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా 2020లో 143 జీవోను తీసుకొచ్చింది. పిహెచ్‌సిల రేషనలైజేషన్ ప్రక్రియను అమలు చేయడానికి అవసరమైన ఆదేశాలు జారీ చేసింది. ఇందులోభాగంగా గురు, శుక్రవారాల్లో డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో 620 వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఖాళీలను గుర్తించింది. కౌన్సెలింగ్‌కు ముందు సీనియారిటీ, ఖాళీల జాబితాను ప్రకటన చేయడంలో జాప్యం చేసిన ఒడిదే వివాదాలు ఉన్నాయి. జటుపటని పరిస్థితి నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ సదరు ఖాళీల కౌన్సెలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. ఇందులో అత్యధికంగా 242 ఎంపిహెచ్‌ఎస్ మేల్ పోస్టింగ్స్ అధిక సంఖ్యలో ఉండడం గమనార్హం. మిగిలిన వాటిలో 242 ఎంపిహెచ్‌ఎస్ ఫీ మేల్, 220 సిహెచ్‌ఒ, ఎంపిహెచ్ ఇఒ, 56 సిహెచ్‌ఎస్, హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టులకు కౌన్సెలింగ్ చేయనున్నట్లు తెలిసింది.

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి బైక్ యాత్ర

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 25 నుంచి 31 వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర"ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో "విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర" కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 20 మండలాలలో దాదాపు 350 కిలోమీటర్ల పాటు స్కూటర్ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యాత్ర ఈనెల 25న ఒంటిమిట్టలో ప్రారంభమై భాకరపేట, సిద్దవటం, అట్లూరు, బద్వేలు, పోరుమామిళ్ల, కలసపాడు, బి.మఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, పులివెందుల, వేంపల్లి, వైవీయూ మీదుగా 31న కడపకు చేరుకుని యాత్ర ముగుస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. పూటకొక జీవోలు తీసుకువస్తు విద్యరంగాన్ని విఛిన్నం చేస్తున్నాయన్నారు. విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు పేనడింగ్‌లో పెట్టి వేధిస్తుందన్నారు. సంక్షేమ హాస్టల్స్‌ని ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడమే మానేసిందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు 7 నెలలుగా మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించనున్న "విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర"ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్, మనోజ్, శేఖర్, చరణ్ పాల్గొన్నారు.

ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న ఓబులేసు

బద్వేలు : ఆరోగ్య భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫౌండేషన్ సభ్యులు మరియు బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఓబులేసు సహ కారంతో బుధవారం స్థానిక షాలోమ్ అనాథ ఆశ్రమంలో టిక్కి బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ఫ్రూట్స్, బిస్కెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డిఎంహెచ్ఒ చంద్రహాసరెడ్డి మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండి, పేదలకు, అనాథలకు, వృద్ధులకు తోచినంత సహాయం చేయడంలో ముందుండాలన్నారు. ఆరోగ్య భారత్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు రహీమ్ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, శివ, విశ్వనాథ్, సుభాన్, కరిముల్లా పాల్గొన్నారు.

ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు

చెన్నూరు: జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆవుల పవన్ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆపదలో ఉన్నవారికి అవసరమైన ఆర్థిక సహాయం చేస్తూ మంచి మనసున్న వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారు. పవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన ఆత్మీయులు, స్నేహితులు మధ్య అట్టహాసంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఐటిడిపి ఛాంపియన్ మణికంఠ, బిసి నాయకులు సుబ్రహ్మణ్యం, శివప్రసాద్, టిడిపి సోషల్ మీడియా తలపనూరు కిరణ్ కుమార్, ఓబులేసు, రవి, రమణ, సురేష్, సిసింద్రీ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా దొంగ ఓట్ల నమోదు : టిడిపి

కడప అర్బన్: రాష్ట్రంలో విచ్చలవిడిగా దొంగ ఓట్లు నమోదు చేస్తూ ఉన్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి విమర్శించారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగ ఓటు నమోదు తాడేపల్లిలో 400 మంది, హైదరాబాదులో వెయ్యిమంది టీమ్‌గా పనిచేసేందుకు వైసిపి నియమించిందని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహించడం రాజ్యాంగ హక్కన్నారు. జిల్లా అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శులు హరి ప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకుల లక్ష్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎంలో విదేశీ విద్యా విభాగం ప్రారంభం

కడప అర్బన్: ప్రతిభగల నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికై, కళాశాలలో బిటెక్ అభ్యసిస్తున్న విద్యార్థులకు విదేశాలలో విద్య అభ్యసించే ఆశావహులకు విదేశీ విద్య విభాగాన్ని కెఎస్ఆర్ఎం కళాశాలలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి, ఐ ఎమ్ ఎఫ్ ఎస్ గెస్ట్ ఆఫ్ హానర్ మాళవిక నూకరాజు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, డీన్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



తరగతి గదిని ప్రారంభిస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

ప్రభుత్వ జోక్యం లేకుండా చూడాలి : 'మన్నూరు'

ప్రజాశక్తి-కడప అర్బన్




మాట్లాడుతున్న అక్బర్

ప్రజా స్వామ్యంలో ప్రజలు ఎవ్వరికైతే ఓటు వేయాలో స్వేచ్ఛగా వేసుకొని హక్కును భారత ప్రభుత్వం కల్పించాలని, ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా చూడాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకే డోర్ నంబర్ పై వివిధ డోర్ నంబర్లు ఓటర్ లిస్ట్‌లో ఉన్నాయని వాటిని సరిచేయాలని కోరారు ఫామ్-7 ను కిరాయి వ్యక్తులు దుర్వినియోగం చేస్తున్నారని, వారి పైన తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వం ఒక నియోజకవర్గంలో అర్హులు ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎపి ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యం కాపాడే విదంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా బిఎల్ఒ, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అక్రమ ఓట్లతో దౌర్జన్యం చేసి అప్రజా స్వామ్యంగా అధికారంలోకి రావాలని చూస్తుందని ఇది ప్రజా స్వామ్యంకు గొడ్డలి పెట్టు అన్నారు. సమావేశంలో టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, 43వ డివిజన్ ఇన్‌ఛార్జి సయ్యద్ యూనుస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి పురస్కారం ప్రదానం

కడప అర్బన్: విద్యా వ్యవస్థలో ప్రణాళిక బద్ధమైన బోధన, సిబ్బంది నిర్వహణలో మెరుగైన విధానాన్ని ప్రవేశపెట్టడానికి కృషి చేసి, వేల మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసి వారిని ప్రతిభావంతులైన విద్యార్థులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థానాలలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డిని మారిషస్ దేశ అధ్యక్షుడు 2023 సంవత్సరానికి 'లీడర్షిప్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' విభాగంలో 'ఎక్సలెన్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' పురస్కారంతో ఘనంగా సత్కరించారు. మారిషస్ దేశ సెక్రటేరియట్లో బుధవారం జరిగిన ప్రత్యేకమైన కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు పృథ్వీరాజ్ సింగ్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. 30 ఏళ్లుగా సాయిబాబా విద్యా సంస్థలను ఉన్నత విలువలతో నడుపుతూ, ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అనుభవిజ్ఞులైన ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ కార్పొరేట్ సంస్థలకు దీటుగా సాయిబాబా విద్యా సంస్థలను నిలబెడుతున్నారు. ఈ సందర్భంగా మారిషస్ ప్రభుత్వానికి, ఇంటలిజెంట్ మైండ్ ట్రస్ట్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

అందరికీ ఆదర్శం 'ఆంధ్ర కేసరి' : కలెక్టర్



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తిదాయకం, ఆదర్శ ప్రాయుడని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, తమ పిల్లలకు కూడా కష్టపడి క్రమంగా తెలుసుకొని ముందుకు వెళ్లే విధంగా నేర్పించాలని కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాల్‌లో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు భారతదేశానికి చెందిన న్యాయవాది, వలసవాద వ్యతిరేక జాతీయవాది, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్త అని అన్నారు. నైతిక విలువలను ప్రాణంగా భావించే ఆయన జీవితం ఎందరికో ఆదర్శనీయమని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీకి ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారని, ఆంధ్ర రాష్ట్రం మద్రాస్ నుంచి విడిపోయాక ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఉన్నారని చెప్పారు. టంగుటూరికి ఆంధ్ర కేసరి (ఆంధ్ర సింహం) అనే బిరుదు కూడా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ టంగుటూరి ప్రకాశం పంతులను ఆదర్శంగా స్ఫూర్తి దాయంగా తీసుకొని ముందుకెళ్లాలని చెప్పారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ వి.విజయ్‌రామరాజుతో పాటు మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాభావంతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి



ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మొలక దశలోనే ఎండిపోతున్నా పంటలను ఇ-క్రాప్ చేసి రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రసూల్‌పల్లె, లింగారెడ్డిపల్లి, దౌలతాపురం, ఎల్ఆర్ పల్లి గ్రామాలలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో అత్యధికంగా 403.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా నేటికీ సాధారణ వర్షపాతం కింద 191.6 మి.మి మాత్రమే నమోదైందని పేర్కొన్నారు. పది సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సంవత్సరం 60 శాతం విత్తనం పడే అవకాశాలు లేవన్నారు. లోటు వర్షపాతంతో 20.8 శాతం మాత్రమే సాగు అయిందని తెలిపారు. విత్తనాలు మొలక దశలోనే ఎండిపోతున్నాయని తెలిపారు. కరువు పరిస్థితులు కారణంగా అధికారులు గ్రామ స్థాయిలో పర్యటనలు జరిపి ప్రత్యామ్నాయ సహాయక చర్యలు చేపట్టేందుకు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ఆర్‌బికె అధికారులు ఇ-క్రాఫ్‌లోని నిబంధనలను సడలించి మొలక దశలో ఎండిపోతున్న పంటలను కూడా ఇ-క్రాప్ చేయాలని డిమాండ్ చేశారు. గండికోట, మైలవరం, బ్రహ్మసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటిని కాలువలకు వదిలి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడి శారదమ్మ

పెయ్యదూడల అభివృద్ధికి పెద్దపీట : జెడి

ప్రజాశక్తి-కాశినాయన

పెయ్యదూడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపెట్ట వేసి అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని పశువర్ధన శాఖ జెడి శారదమ్మ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన నరసాపురంలోని పశు వైద్యశాల ఆవరణంలో డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో ఉత్తమ మేలు జాతి లేగదూడల ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పాడి పరిశ్రమ చేసి నష్టపోకుండా ఉండాలంటే పెయ్యదూడలను పుట్టించే విధంగా ప్రత్యేకమైనటువంటి మందులు వచ్చాయని ప్రతి ఒక్కరూ అలాంటి సూదులను పశువులకు వేయించి కుటుంబ అభివృద్ధికి మీరే తోడ్పడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇలాంటి మందులు పంపిణీ చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అన్నీ కూడా ఉపయోగించుకోవాలని కోరారు. అక్కడికి దాదాపు 41 మంది రైతులు 73 పెయ్యదూడలను తెచ్చారన్నారు. వాటిలో మేలు జాతి దూడలను అధికారులు ఎన్నిక చేసి వారికి బహుమతులు ప్రధానం చేశారు. వాటికి బ్రూ సెల్లోసిస్ టీకాలు వేశారు. కాల్షియం లివర్ టీకాలని కూడా ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు రమణయ్య, ఇఒ జి.రమేష్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశువైద్యాధికారి శివరామిరెడ్డి, ఇటుకలపాడు పశువైద్యాధికారి అశోక్ కుమార్, కలసపాడు, టేకురుపేట, వెంకటాపురం తదితర గ్రామాల పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన : ఎమ్మెల్యే

చెన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలను అందిస్తుందని కమలాపురం శాసనసభ్యులు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామానుజన్ రెడ్డి అన్నారు. బుధవారము చెన్నూరు గ్రామంలోని అరుంధతి నగర్, కొత్త గాంధీనగర్, బెస్తకాలనీ, సి.బుడ్డాయపల్లె గ్రామంలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు వేగంగా అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 90 శాతంకు పైగా కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సురేష్ యాదవ్., మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి. పార్టీ నాయకులు అన్వర్‌బాష, అబ్దుల్ రబ్, చంద్ర, రమణ, పోల సుబ్బయ్య రవి, ప్రదీప్ కుమార్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, దిలీప్ కుమార్‌రెడ్డి, నిత్య పూజయ్య, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, దిలీప్ కుమార్‌రెడ్డి, చంద్రారెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి ఉమామహేశ్వర్‌రెడ్డి, శాఖ అధికారి గంగిరెడ్డి, ఎఒ రామలింగారెడ్డి, పంచాయతీ సెక్రటరీ రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కాశినాయన: మహిళా శక్తికి సంబంధించి టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో పార్టీని బద్వేలు నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని మండల యూత్ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం టిడిపి నాయకులు ఆయన అందరూ కలిసి గణనపల్లె, వడ్డమాను గ్రామ పంచాయతీలలో డోర్ టు డోర్ తిరిగి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు వంటకాల్లో శిక్షణ

కడప అర్బన్: ఆర్తి ఉమెన్ సెంటర్‌లో కోవిడ్ బాధిత మహిళలకు ఇచ్చే సాంకేతిక శిక్షణలో భాగంగా 30 మంది స్త్రీలకు వివిధ వంటలలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బుధవారం హ్యారిస్ కిచెన్ యూకే వారి సాంకేతిక సహాయంతో ప్రారంభించారు. ఈ సందరరేగా ఆర్తిహోం సెక్రటరీ దుర్గా కుమారి మాట్లాడుతూ చిరు ఆహార పదార్థాల వినియోగం పెరగడం వలన శుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తయారు చేయడంలో తగిన శిక్షణ పొందారని తెలిపారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించే విధంగా తయారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ డైరెక్టర్ భాగ్యమ్మ, రిసోర్స్ పర్సన్ శారద, ఆర్తి సోనీ ప్రాజెక్ట్ ప్రతినిధి రాఘవేంద్ర, ఆర్తి ఉమెన్ సెంటర్ సభ్యులు భాగ్య, పర్వీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - కడప

బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, కష్టాలు తెలియజేయడంతో పాటు బాల్య వివాహాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి అన్నారు. బాలల చట్టాల అవగాహన కార్యక్రమాలలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో జిల్లాలోని ఐసిడిఎస్ సూపర్వైజర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఐసిడిఎస్ సూపర్వైజర్లు గ్రామ స్థాయిలోని అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో కలిసి పనిచేస్తుంటారన్నారు. క్షేత్రస్థాయిలో బాల్య వివాహం జరిగే విషయం ముందుగానే తెలుసుకొని వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. అవగాహన కల్పించడం ద్వారా బాల్యవివాహాలు జరగకుండా చూడవచ్చునన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి సూపర్వైజర్ పిల్లల కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో కౌమార దశలో ఉన్న పిల్లలకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సభ్యుల సమావేశాల్లో కూడా మహిళలకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.ఆర్. సుభాష్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సూపర్వైజర్ వారి పరిధిలో ఎంతమంది కిషోర్ బాలికలు ఉన్నారు వారి వివరాలు సూపర్వైజర్ వద్ద ఉండాలన్నారు. అంగన్వాడీ కార్యకర్త మరియు మహిళా పోలీసుల ద్వారా కిశోర బాలికల గృహాలను సందర్శించి వారిని చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సును జయప్రదం చేయండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

రోజూ రోజుకు పెరుగుతున్న నిరుద్యోగం సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరుద్యోగం-పరిష్కార మార్గాలు అనే అంశం పై ఈ నెల 25న విజయవాడలో నిర్వహించే జాతీయ సదస్సును జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు షకీర్, డి.ఎం.ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం పాత బస్టాండ్‌లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటు గద్దలైన అదానీ, అంబానీలకు దొచిపెడుతున్నడన్నారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు విజయ్, పసుపులేటి వినోద్, సభ్యులు పవన్, శశికుమార్ పాల్గొన్నారు.

25న చలో విజయవాడకు తరలిరండి

ఈ నెల 25న తలపెట్టిన చలో విజయవాడకు తరలిరావాలని డివైఫ్ఐ జిల్లా కార్యదర్షి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. జాతీయ సదస్సు కరపత్రాలను పట్టణంలోని కోచింగ్, స్టడీ సెంటర్లలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, నరసింహులు, నగర అధ్యక్షులు షకీర్, పాల్గొన్నారు.

వైవీయూలో గిడుగు రామ్మూర్తి జయంతి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి వారోత్సవాలు ప్రారంభించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 23 నుంచి 29 వరకు తెలుగు భాషా సాహిత్యాలకు గిడుగు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ విద్యార్థుల్లో అవగాహన తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జి.పార్వతి అన్నారు. విశ్వ విద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్టర్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య సూచనల మేరకు వ్యాస రచన, పద్య పఠనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. వ్యవహారిక భాషను పాఠ్య గ్రంథాల్లోకి తేవడానికి గిడుగు చేసిన సేవలను అధ్యాపకులు కొనియాడారు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త, హేతువాది అయిన గిడుగు వారి సేవలకు గుర్తుగా ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం చేసుకుంటున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలుగు శాఖ ఆచార్యులు పి.రమాదేవి, ఎన్.ఈశ్వరరెడ్డి, ఎంఎం.వినోదిని, పిహెచ్.డి,పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర కేసరి జయంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి కెకెఎన్ అన్బురాజన్ ప్రకాశం పంతులు చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వి కృష్ణారావు, ఎఆర్ డిఎస్‌పి రమణయ్య, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, ఆనంద్, ఆర్‌యస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.


టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

డ్రైవర్ ఆర్‌కె కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేంపల్లె

అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సుమో డ్రైవర్ ఆర్ రామ కృష్ణ కుటుంబానికి సుమో స్టాండ్ డ్రైవర్లు, ఓనర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. స్థానిక పుల్లయ్య తోటలో నివాసం ఉన్న డ్రైవర్ ఆర్‌కె కుటుంబ సభ్యులను గురువారం సుమో స్టాండ్ డ్రైవర్లు, ఓనర్లు పరామర్శించారు. సుమో స్టాండ్‌లో వసూలు చేసిన రూ.30 వేలు ఆర్‌కె తండ్రి సంపతి రామయ్యకు వైఎస్ఆర్ సుమో స్టాండ్ అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు, చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మ్యాంగో) అందజేశారు. ఈ సందర్భంగా కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ అనారోగ్యంతో డ్రైవర్ రామకృష్ణ ఆకస్మికంగా చనిపోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి వైఎస్ఆర్ సుమో స్టాండ్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. వైఎస్ఆర్ సుమో స్టాండ్ ఉపా ధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ కన్వీనర్ ముత్యాల ఆంజ నేయులు, ప్రధాన కార్యదర్శి విజయ్, రమణ, సూరి, రాజా, మాధవ, ఆది, రంగారెడ్డి, రామయ్య, సుధాకర్, శేఖర్, షఫి, ఓబులేసు, ఆంజి, చంద్ర పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న నాగేంద్ర బాబు

నేడు సుంకేసులలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - ఖాజీపేట

గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఖాజీపేట-2 సచివాలయ పరిధిలోని సుంకేసుల, యానాది కాలనీ, సుంకేసుల ఎస్సీ కాలనీలో గురువారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పర్యటించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

పోకనాటి, పెడకంటి వంటి సామాజిక కుల ప్రస్తావనలకు దూరంగా ఉండే ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. మైదుకూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపికి చాలా ఏళ్లుగా దూరంగా ఉన్న సంఘన కిశోర్‌కుమార్‌రెడ్డి తన వ్యక్తిగత భూ సమస్యను సామాజిక, కుల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. పెడకంటి, పోకనాటి కులాల మధ్య వ్యత్యాసం ఏ సందర్భంలోనూ ఎమ్మెల్యే చూపరని తెలిపారు. అలా వత్యాసం చూపి ఉంటే తమకు రాష్ట్రస్థాయిలో పదవులు వచ్చేవి కావన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల వారికి ఆయన సమన్యాయం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రెడ్డి సామాజిక వర్గంలో తేడాలు ఏమాత్రం లేవని అందరూ కలిసి పోయారని తెలిపారు. కిశోర్‌కుమార్‌రెడ్డికి వెనుక టిడిపి నాయకులు ఉన్నారన్నారని ఆరోపించారు. కిశోర్ అన్న చల్లబసాయపల్లె సర్పంచు హరినాధరెడ్డి ఎమ్మెల్యే వెంట కొనసాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, చియ్యపాడు ఎంపిటిసి ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి

అవగాహనతో హెచ్ఐవికి దూరంగా ఉండొచ్చు


ప్రజాశక్తి - చాపాడు

హెచ్ఐవిపై అవగాహన ఉంటే దానికి దూరంగా ఉండవచ్చని లక్ష్మీపేట పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు సూచించారు. మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో బుధవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి సోకడం వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కొంత మందికి హెచ్ఐవి పరీక్షలు, సుఖ వ్యాధుల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ వర్కర్స్ స్కీం సూపర్వైజర్ దర్బార్, వైద్య సిబ్బంది ఎంపిహెచ్ఒ సుమలత, ఎఎన్ఎం కీర్తి, ఆశా కార్యకర్తలు, సిబ్బంది సురేంద్ర, అమీర్, ప్రజలు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బాలలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని, యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హుస్సేన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ, పోలీస్ శాఖ రెవెన్యూ శాఖ, రైట్స్ సంస్థ ఐజేయం (ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్) ఆధ్వర్యంలో గురువారం వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ఇటుకల పరిశ్రమ, కంకర మిషన్ పరిశ్రమలో వెట్టిచాకిరి, బాల కార్మికుల వినియోగంపై తనిఖీలు చేశారు. అక్కడి కార్మికులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వేతనాలపై సమగ్రంగా విచారించారు. కార్మికుల భద్రతపై ఆరా తీశారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం, సేఫ్టీ మెజర్ తీసుకోవాలని పరిశ్రమ యజమానులకు సూచించారు. కార్యక్రమంలో రైడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎస్ త్యాగరాజు, లేబర్ ఆఫీసర్ అల్లా బకాష్, డిప్యూటీ తహశీల్దార్ కరిముల్లా, లేబర్ కార్యాలయ సిబ్బంది రామకృష్ణ, రైడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.


పరిశ్రమలను తనిఖీ చేస్తున్న అధికారులు

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు వస్తాయని జిఎన్‌డి సొల్యూషన్ కంపెనీ చైర్మన్ అన్నారెడ్డి శివారెడ్డి అన్నారు. బుధవారం లయోలా పాలిటెక్నికల్ కళాశాల యాజమాన్యం జిఎన్‌డి సొల్యూషన్ కంపెనీతో ఎంఒయు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శివారెడ్డి మాట్లాడుతూ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన విద్యార్థులకు తమ కంపెనీలో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల కస్పాండెంట్ అంటోనీ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ విజయరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ 13వ వార్డులో రూ.35 లక్షల వ్యయంతో 180 మీటర్ల సిసి రోడ్డు, 600 మీటర్ల మురుగునీటి కాలువ నిర్మాణం కోసం శాసనసభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి బుధవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూజా ఇంటర్నేషనల్ స్కూల్, మై డాడీ హోం వ్యవస్థాపకుడు ఎన్.రాజారెడ్డి తన సోదర సమానుడని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరాభిమాని అని తెలిపారు. ఆయన హత్య తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రాజారెడ్డి హత్యకు రాజకీయాన్ని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆపాదిస్తున్నారని, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే నిందను ఆపాదిస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో నిస్వార్థంగా పోలీసులు పురోగతి సాధించారని తెలిపారు. సీఐ ఇబ్రహీం, ఎస్ఐ చిరంజీవి, శివప్రసాద్‌ను అభినందిస్తున్నటు ఆయన పేర్కొన్నారు. సభ్య సమాజం తల దించుకునేలా వరద మాట్లాడుతున్నారన్నారు. దయచేసి ఇప్పటికైనా పోలీసులపై వరద అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తాము రాజకీయ ప్రత్యర్థులమే కానీ శత్రువులం కాదన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపు వైసిపిది.. సంబరాలు బిజెపి, టిడిపి నాయకులవా?

ఈనెల 19న ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ 13వ వార్డు మెంబర్ ఉప ఎన్నికల్లో బరిలో నిలిచిన ఇరువురు వైసిపి అభ్యర్థులేనని, ఒకరు రెబెల్ కాగా మరొకరిని తాను ప్రతిపాదించి బరిలో నిలిపినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు రాజకీయాల్లో సహజమన్నారు. గెలిచిన అభ్యర్థి కూడా వైసిపి చెందిన వారేనని, ఇందులో తాను బలపరిచిన అభ్యర్థి ఓడిపోవడం ప్రజా నిర్ణయమన్నారు. ఆ నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజుపాలెం మండలం తొమ్మిదవ వార్డులో వైసిపికి సరైన అభ్యర్థి లేకపోవడంతో అక్కడ టిడిపి గెలిచినటు తెలిపారు. మూలవారిపల్లెలో తమ అభ్యర్థి బలంగా ఉన్నందున గెలిచామన్నారు. ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ 13వ వార్డు ఉప ఎన్నికలో తలపడిన ఇరువురు వైసిపి మద్దతుదారులే అయినప్పుడు ప్రొద్దుటూరు టిడిపి, బిజెపి నాయకులు తాము గెలిచినట్లు, ఇక్కడి గెలుపోటములు శాసించినట్లు సంబరాలు చేసుకోవడం ఏమిటని రాచమల్లు ప్రశ్నించారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ ఏడాది మే 4న రాత్రి పార్నపల్లి గ్రామ కోన మల్లేశ్వరస్వామి ఆలయంలో వాచ్‌మాన్‌గా పని చేస్తున్న చిల్లా ఈశ్వరయ్య హత్య కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్నపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి ఆలయ పాత వంట గదిలో రోకలి బడెతో తలపై కొట్టి ఈశ్వరయ్యను హత్యా చేశారని, మృతదేహాన్ని పొయ్యి గాడిలో పడేశారని, సిసి టివి రూమ్‌లో ఉన్న మానిటర్‌ను కూడా తీసుకెళ్లారని మే 5న ఆలయ ప్రధాన అర్చకుడు రామడుగు రాజశేఖర్ శాస్త్రి లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఆలయం ఎదురుగా ఉన్న అన్నదాన సత్రం వంట మనిషి రామాంజనేయులు ఉదయం నుండి కనబడ లేదని, అతనే వాచ్‌మాన్ ఈశ్వరయ్యను హత్యా చేసి ఉండవచ్చని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఆ మేరకు కేసు విచారించామన్నారు. బుధవారం పులివెందుల ఇన్‌ఛార్జి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రాజుకు అందిన సమాచారం మేరకు మధ్యాహ్నం12 గంటలకు నిందితుడు గూడూరు రామాంజనేయులును అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడు అనంతపురం జిల్లా, గార్లదిన్నె మండలం సిరివరం గ్రామవాసి అని తెలిపారు. మండలంలోని కదిరి రోడ్డులో నామాల గుండు ఆలయం సమీపంలో నిందితుడ్ని అరెస్ట్ చేశారన్నారు. అనంతరం కోన మల్లేశ్వరస్వామి ఆలయం దగ్గరలో దాచిన టివి మానిటర్, అతని దుస్తులను స్వాధీనం చేసుకుని గురువారం పులివెందుల జెఎఫ్‌సిఎం కోర్టుకు హాజరుపరచనున్నట్లు డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో లింగాల ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి వినోద్‌కుమార్

సిఐటియులో పలువురి చేరిక


సిఐటియు కండువా వేస్తున్న ఆటో యూనియన్ అధ్యక్షులు ఆదాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రజా రవాణాలో ఎపిఎస్ ఆర్‌టిసి తర్వాత ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఆటో రంగానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం చాలా దారుణమని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, సిఐటియు పట్టణ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆదాము తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పట్టణంలో ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు, ఆటో నగర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన ఆటో కార్మికుడికి పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ బ్యాంక్‌ల ద్వారా సబ్సిడీ రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుడికి ప్రమాదవశాత్తూ ఏమైనా జరిగితే రూ.10 లక్షలు ప్రభుత్వం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. మైలవరం సంబంధించిన ఆటోస్టాండ్ కార్మికులు సిఐటియులోకి 52 మంది చేరారు. సిఐటియు పోరాటాలు చూసి ఆకర్షితులై చేరారని తెలిపారు. ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆదాము కండువాలు వేసి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు దివాకర్, హుస్సేన్, నరేంద్ర, ప్రభాకర్ పాల్గొన్నారు.

చంద్రయాన్-3 దేశానికి గర్వకారణం

ప్రజాశక్తి - ఖాజీపేట

అంతరిక్ష చరిత్రలో చంద్రయాన్-3 ఘన విజయం భారతదేశానికి గర్వకారణమని, ఇది భారతీయులందరి ఘన విజయమని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక మాజీ కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం చంద్రయాన్-3 ప్రయోగం విజయం సాధించి, జాబిల్లిపై జెండా పాతిన సందర్భంగా రెడ్యం, ఆయన సతీమణి లక్ష్మీ ప్రసన్న, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, కుమారుడు రెడ్యం వెంకట సాయిప్రత్యూష్‌రెడ్డి జాతీయ జెండా చేత పట్టి ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లె ఓబయ్య యాదవ్, రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, దుగ్గిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఇండ్ల వెంకట్‌రెడ్డి, మున్నెల్లి చిన్నా, తొర్రివేముల నరసింహ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : చంద్రయాన్-3 ద్వారా భారతదేశం చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టడం అంతరిక్ష రంగంలోనే అద్భుత విజయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి బుదవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా, చైనాలకు కూడా సాధ్యంకాని దాన్ని ఇస్రో సుసాధ్యం చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ అద్భుత సంఘటన ప్రపంచ అంతరిక్షంలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని తెలిపారు. భవిష్యత్తులో భారతదేశం మరెన్నో ప్రయోగాలను చేసి ప్రపంచ దేశాలకు ధీటుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశానికి ఇంతటి ఘనవిజయాన్ని అందించిన చంద్రయాన్-3 ప్రాజెక్టులో పని చేసిన శాస్త్రవేత్తలు, సిబ్బందికి ఒంటేరు ధన్యవాదాలు తెలిపారు.

వేంపల్లె : చంద్రయాన్-3 విజయం చారిత్రాత్మక విజయమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ చంద్రునిపై అడుగు పెట్టిన 4వ దేశంగా చంద్రున్ని దక్షిణ ధృవంపై అడుగు పెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు. ఇది అద్భుత ఖగోళ ఘట్టమన్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు అందరికీ అభినందనలు తెలిపారు. భారత తొలి ప్రధాని, నవభారత నిర్మాత పండిట్ నెహ్రూ దార్శనికుడు, దూర దృష్టికి ఇది నిదర్శనం అన్నారు.


జాతీయ జెండా చేబూని హర్షం వ్యక్తం చేస్తున్న రెడ్యం

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్ మనోహర్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రతి ఒక్కరూ జాబ్‌మేళా ద్వారా ఉద్యోగావకాశాలను పొందాలని పురపాలక ఇన్‌ఛార్జి, వైస్ చైర్మన్ వైయస్ మనోహర్ రెడ్డి, పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్ పేర్కొన్నారు. పులివెందుల పరిధిలోని స్వయం సహాయ సంఘాల సభ్యులకు గురువారం మెప్మా కార్యాలయంలో ఆదిత్య బిర్లా గార్మెంట్స్ వారు జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల నుంచి దాదాపు 90 మంది మహిళలు హాజరయ్యారు. ముందుగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పులివెందుల ప్రాంతంపై ప్రత్యేకదృష్టి పెట్టారని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఎన్నో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ఇక్కడ ఆదిత్య బిర్లా కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదిత్య బిర్లా గార్మెంట్స్ కొత్త భవనం త్వరలో ప్రారంభం కానుందన్నారు. ఈ కంపెనీకి వెళ్లేందుకు బస్ సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆదిత్య బిర్లా మేనేజర్ మెప్మా అధికారి గంగులయ్య, కౌన్సిలర్లు పార్ణపల్లి కిషోర్, ఖాదర్, సిఒలు నాయుడు, నాగన్న, ఆర్‌పిలు పాల్గొన్నారు

సేవలందించడమే లక్ష్యం

ప్రొద్దుటూరు : మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సమాజంలో అవసరార్థులకు సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తోందని ఫౌండేషన్ ఛైర్మెన్ లక్ష్మణ్ మోరె తెలిపారు. స్థానిక ఈశ్వర్ రెడ్డినగర్‌కు చెందిన కంభం సుబ్బరాయుడు అను అనాథ వృద్ధుడు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అంతిమ సంస్కారం చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఫౌండేషన్ ఛైర్మెన్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించి హిందూ శ్మశాన వాటికలో సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవలందించడం ద్వారానే సమాజంలో మంచి పేరు సంపాదించవచ్చన్నారు. తమ ఆధ్వర్యంలో శ్రీఅమ్మ శరణాలయం నిర్వహించబడుతోందని, ఇక్కడ వృద్ధులు సేదదీరుతున్నారన్నారు. దాతలు సహకరించాలని ఆయన కోరారు.

రాయలసీమలో కరువుకు కారణం ఎవరు?

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాయలసీమలో పంటల సాగు దాదాపు 10 ఏళ్ల కనిష్టానికి దిగజారి పోయిందని, ముఖ్యంగా వరి సాగు పడిపోయిందని దీనికి కారణం ఎవరో తేల్చి చెప్పాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కెసి కెనాల్‌కు ముఖ్యమైన గుండ్రేవుల ప్రాజెక్టును గానీ, రాజోలి, జొలదరాశి ప్రాజెక్టులు నిర్మించి ఉంటే ఈ దుస్థితి ఉండకపోయేదన్నారు. 2019కి ముందు జగన్ రెండేళ్లలో నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. కేవలం శిలాఫలకాలకు మాత్రమే పరిమితమన్నారు. రాయలసీమ రైతుల బాధ పట్టించుకునేనాథుడే కరువయ్యారని తెలిపారు. ప్రత్యేక రాయలసీమ విషయంలో ఆలోచించి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం శ్రీశైలం నుండి నాగార్జునసాగర్‌కు విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీళ్ల వదులుతూ, శ్రీశైలం డ్యాంలో నీళ్లను తగ్గిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోస్తా ఆంధ్ర నాయకులతో లాలూచీ పడుతోందని, అసలు రాయలసీమ మీద చిత్తశుద్ధి ఏ నాయకులకైనా ఉందా అని ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు.

స్కూటర్ యాత్రను జయప్రదం చేయండి

చాపాడు : విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఈనెల 31 వరకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గండి సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మైదుకూరు పట్టణంలోని విఆర్ జూనియర్ కాలేజీలో బుధవారం స్కూటర్ యాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల పరిధిలో 20 మండలాల్లో దాదాపు 350 కిలోమీటర్లపాటు స్కూటర్ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యాత్ర ఈనెల 25న ఒంటిమిట్టలో ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కలివెలి రాజ శేఖర్, నవీన్ పాల్గొన్నారు.

రూ.16 లక్షలతో లక్ష్మీపేటలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని లక్ష్మీపేట సచివాలయం ప్రహరీ, బిసిల శ్మశాన వాటికకు ప్రహరీ తదితర వాటికి రూ.16 లక్షలతో పనులు చేపట్టినట్లు సర్పంచు కర్నాటి శ్రీవిద్య తెలిపారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయం, ఆర్‌బికెకు ప్రహరీ నూతనంగా నిర్మించామన్నారు. కేతవరం పరిధిలోని శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించామన్నారు. గతంలో సచివాలయాన్ని కలెక్టర్ సందర్శించిన సందర్భంగా ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా, ఆయన డిఎంఎఫ్ కింద రూ.16 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం ప్రహరీ నిర్మాణ పనులు పూర్తయ్యాయని సర్పంచు తెలిపారు. సచివాలయ భవనాలకు ప్రహరీ, ఆర్చి నిర్మించడంతో మొక్కల పెంపకానికి అవకాశం ఏర్పడిందని తెలిపారు.


పూర్తయిన లక్ష్మీపేట సచివాలయ భవనాల ప్రహరీ

2న శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లెలో సెప్టెంబర్ 2,3,4 తేదీల్లో శివాలయ నూతన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ దాత, మాజీ ఎంపిటిసి కంచెర్ల గంగరాజు తెలిపారు. కార్యక్రమాలు మూడు రోజులపాటు శివాలయ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పలు పూజ కార్యక్రమాలు చేపడుతున్నారు. శివాలయం విగ్రహ ప్రతిష్ట రోజున కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరుకానున్నారు. సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతోపాటు గ్రామస్తుల ఆర్థిక సహకారం చింతల మడుగుపల్లెలో నూతనంగా శివాలయం నిర్మించి విగ్రహ ప్రతిష్ట చేస్తున్నట్లు చెప్పారు. 2వ తేది రాత్రి చెక్కభజన, 3న గ్రహాల ఊరేగింపు, కోలాటం కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. 4న ఎడ్లచే బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. గెలుపొందిన ఎడ్లకు బహుమతులు అందజేయనున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


చింతలమడుగుపల్లెలోని శివాలయం

రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యవజన దినోత్సవం సందర్భంగా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మారథాన్ రన్ కాంపిటీషన్స్ నిర్వహించారు. ఆ మేరకు మారథాన్ రన్ పోటీలను కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగేంద్ర, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ మారథాన్ రన్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, అధ్యాపకులు డాక్టర్ సతీష్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మల్లేశ్వరమ్మ, రాజారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారభిస్తున్న వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రజాశక్తి - మైలవరం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచిగా అందించాలని ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ కోరారు. మండలంలోని దొమ్మర నంద్యాల ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులను మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న భోజన సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు మంచి భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. విద్యార్థులు అందరికీ పౌష్టికాహార లోపంలేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, ప్రేమ్, ఇర్ఫాన్, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వినయ్‌కుమార్

ఉపాధ్యాయులకు నోటీసులు

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని బుక్కాయపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, ఉపాధ్యాయురాలు గ్లోరీకి నోటీసులు ఇచ్చినట్లు ఇన్‌ఛార్జి ఎంఇఒ రవి తెలిపారు. బొట్టు, పూలు పెట్టుకుని పాఠశాలకు రావద్దని ఉపాధ్యాయులు చెబుతున్నారని విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. ఈ విషయమై బుధవారం తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఇన్‌ఛార్జి ఎంఇఒ రవి సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. దీనిపై డిఇఒకు నివేదిక ఇవ్వనున్నట్లు రవి తెలిపారు.

ఉచితంగా బస్సు పాసులు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులకు ఉచిత ఆర్‌టిసి బస్సు పాసులను బుధవారం పంపిణీ చేశారు. ప్రొద్దుటూరు ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్ లావణ్య అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్ విద్యార్థులకు అవసరమైన పాసులను అందజేయడం అభినందనీయమన్నారు. కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులు ఇంటికి వెళ్లే సమయంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రెడ్డి, కండక్టర్ గురుస్వామి, పాఠశాల ఎస్ఒ బి.నాగలక్ష్మి, పిఇటి ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేస్తున్న అధికారులు

క్రైం కార్నర్

అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని కడప రోడ్డులో మార్కెట్ యార్డ్ వద్ద బుధవారం లారీ అదుపుతప్పి డివైడర్‌లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప వైపు నుండి తాడిపత్రి వైపు ఐరన్ లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొని ఆవలివైపు రోడ్డుకు వెళ్లిందన్నారు. ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. డ్రైవర్ నిద్రపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాదం కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు లారీని పక్కకు తొలగించారు.

